బంజారాల తల్లి.. శుభాల కల్పవల్లి

- ఏడుగురు అక్కాచెల్లెలుగా కొలువుదీరిన సిట్లమాత
- కన్నె పిల్లతోనే బోనం సమర్పణ ఇక్కడ ప్రత్యేకం
- బోనంలో ఉల్లిపాయ, జొన్నలు, బెల్లం


బంజారాహిల్స్ వెంకటేశ్వరనగర్‌లో సిట్ల మాత ఆలయంలో ఏడుగురు అమ్మవార్లు

బంజారాహిల్స్, జూలై 26(ఆంధ్రజ్యోతి): కష్టం వచ్చినప్పుడు, ఆపద సంభవించినప్పుడు ప్రకృతి నుంచి పుట్టిన నమ్మకమే సిట్ల దేవతలు. జమ్మిచెట్టు కింద వెలిసిన ఏడుగురు అమ్మలను కొలిస్తే కొంగు బంగారం అవుతుందన్న గిరిపుత్రుల నమ్మకం. బోనాలు వచ్చాయంటే చాలు ఆలయాల వద్ద బంజారాల సంస్కృతి తాండవిస్తుంది. ఇలాంటి భిన్న సంస్కృతిని చూడాలంటే అడవుల్లోకి వెళ్లాల్సిన అవసరం లేదు. బంజారాహిల్స్ నడిబొడ్డునే ఏడుగురు అక్కచెల్లెళ్లుగా సిట్ల మాత కొలువుదీరింది. ప్రతియేటా బోనాల్లో ఈ ఆలయంలో బంజారాల పూజలు చూసి దర్శించేందుకు రోడ్డు నెంబరు 14లోని వెంకటేశ్వర కాలనీకి వేల మంది తరలివస్తారు. 28(ఆదివారం) నుంచి జరగనున్న ఈ వేడుకలకు ప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. గ్రామాల్లో జమ్మి చెట్టు కింద రాళ్లను ప్రతిష్ఠించి అమ్మవార్లుగా కొలుస్తారు. కానీ ఇక్కడ ఏడుగురు అమ్మవార్లను విగ్రహాల రూపంలో ఏర్పాటు చేయడంతో మరింత ప్రత్యేకతను చాటుకుంది. ఏడుగురు అక్కాచెల్లెళ్లుగా కొలువుదీరిన సిట్ల మాతకు ఇప్పటికి బంజారాల సంస్కృతి ప్రకారం బోనాల జాతర నిర్వహిస్తారు. కన్నె పిల్ల చేత అమ్మవారికి బోనం సమర్పించడం ఇక్కడి ఆనవాయితీ. లంబాడీ సంస్కృతి దుస్తులు ధరించి యువతులు అమ్మవారికి బోనం సమర్పిస్తారు. బోనంలో ఉల్లిపాయ, జొన్నలు, బెల్లంతో చేసి పర్వాన్నం అమ్మవారికి నైవేద్యంగా చూపిస్తారు.

వంద సంవత్సరాల చరిత్ర

సిట్ల మాత ఆలయానికి వంద సంవత్సరాల చరిత్ర ఉన్నదని పూర్వీకులు అంటున్నారు. గతంలో ఇక్కడి హిల్స్‌లో బంజారాలు జీవనోపాధి కోసం వ్యవసాయం చేసేవారు. బంజారా చెరువు నీటిని మళ్లించుకుంటూ పంటలు పండించుకునేవారు. ప్రస్తుతం భాగ్యనగర్ స్టూడియో ఉన్న ప్రాంతంలో దట్టమైన అడివి ఉండేది. దానికి మధ్యలో జమ్మి చెట్టు నీడన ఏడు రాళ్లు ఒకదాని పక్కన ఒకటి ప్రతిష్ఠించినట్లుగా వరుసగా ఉండేవి. బొజ్యానాయక్ అనే బంజారా నాయకుడు ఓ సారి ఆ జమ్మి చెట్టు నీడన విశ్రాంతి తీసుకుంటడగా ఆ రాళ్లు ఆయన కంటపడ్డాయి. జమ్మిచెట్టు కింద ఉండటంతో తమ ఆచారం ప్రకారం అవి సిట్ల మాతవేనని నమ్మకం ఏర్పడింది. ఆ వెంటనే అక్కడ జాతర నిర్వహించి తమ కుల దైవంగా పూజించడం మొదలు పెట్టారు. పొలం పనులకు వచ్చే లంబాడీలు అమ్మవారికి నైవేద్యం పెట్టిన తర్వాతే వారు భుజించేవారు. అలా కొద్ది కాలం జమ్మి చెట్టు నీడనే పూజలు జరిగాయి. తర్వాత అది ప్రైవేటు స్థలమని కొంత మంది ఆలయం ఆ చుట్టు ఉన్న ప్రాంతంలో కంచె వేశారు. దీంతో లాలు నాయక్ అనే నాయకుడు అమ్మవారి విగ్రహాలను సమీపంలోని తనకు సంబంధించిన ఖాళీ స్థలంలో నెలకొల్పాడు. ఇప్పుడు అది వెంకటేశ్వరనగర్‌గా ఆవిర్భవించింది. మాజీ కార్పొరేటర్ భారతీనాయక్ ఇక్కడి అమ్మవార్లకు ఆలయం నిర్మించి విగ్రహాల రూపంలో ప్రతిష్ఠించారు. ఏడుగురు అక్కాచెల్లెళ్లు ఒకదగ్గరే కొలువుదీరి ఉండగా ప్రతి నిత్యం పూజాదికాలు నిర్వహిస్తారు.


సిట్ల మాత ఆలయం

మహానగరంలో గిరిజనుల సంప్రాదాయం

రాష్ట్రంలోనే సిట్ల మాతకు ఈ ఆలయం మొదటిదని స్థానిక గిరిజన మహిళ లక్ష్మీబాయి అన్నారు. ఆమె మాట్లాడుతూ ఇక్కడ మొదట ఇలాగే పూజలు జరిపామన్నారు. అమ్మవార్లను విగ్రహ రూపంలో చూడటం ఆనందంగా ఉందన్నారు. పండుగలు, బోనాల సమయంలో అమ్మవారికి తమ సంప్రదాయం ప్రకారం ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. ఉమ్లీబాయి మాట్లాడుతూ బోనాలు వస్తే చాలు సిట్ల మాత ఆలయంలో వేడుకలు చాలా బాగా జరుగుతాయన్నారు. మహా నగరంలో తమ సంప్రదాయం ప్రకారం ఆలయం ఉండటం ఆనందం అనిపిస్తుందన్నారు. ప్రతీ ఏడాది ఘనంగా పండుగను నిర్వహించుకుంటామన్నారు. ఈ ఆలయం ద్వారా ఇక్కడ స్థానికులకు బంజారా సంస్కృతిని చాటే అవకాశం కలిగిందన్నారు.

అంబేడ్కర్ యూనివర్సిటీలో వన మహోత్సవం


మొక్క నాటుతున్న ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ప్రొ.సుధారాణి

హైదరాబాద్ సిటీ, జూలై 26 (ఆంధ్రజ్యోతి): డా.బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలోయునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్, వెల్స్ ఫార్గో సహకారంతో కౌన్సిల్ ఫర్ గ్రీన్ రివల్యూషన్ సంయుక్తంగా శుక్రవారం యూనివర్సిటీ క్యాంపస్‌లో మొక్కలు నాటారు. కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా పచ్చటి కవచాన్ని పెంచేందుకు యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్, వెల్స్ ఫార్గో అధికారులు, వలంటీర్లు మూడు రోజులుగా 1,800 మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ప్రొ.ఈ.సుధారాణి పాల్గొని మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఇంజనీర్ లక్ష్మీప్రసాద్, కౌన్సిల్ ఫర్ గ్రీన్ రివల్యూషన్ అధికారి అన్నమయ్య, తదితరులు పాల్గొన్నారు.


బోనాల వేడుకల్లో హెచ్‌ఎండీఏ ఉద్యోగులు

హెచ్‌ఎండీఏలో ఘనంగా బోనాలు

హైదరాబాద్ సిటీ, జూలై26 (ఆంధ్రజ్యోతి): అమీర్‌పేటలోని హెచ్‌ఎండీఏ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం బంగారు మైసమ్మ అమ్మవారి బోనాల ఉత్సవం నిర్వహించారు. మహిళా అధికారులు, ఉద్యోగులు బోనాలు ఎత్తుకొని పోతురాజుల విన్యాసాల మధ్య అమ్మవారికి సమర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా అమ్మవారికి పలువురు మొక్కులు సమర్పించుకున్నారు. హెచ్‌ఎండీఏ కార్యదర్శి చంద్రయ్య మాట్లాడుతూ హెచ్‌ఎండీఏ విశ్వవ్యాప్తంగా పేరు గడిచిందంటే ఉద్యోగుల పాత్ర చాలా కీలకంగా ఉందన్నారు. ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్షులు విశ్వప్రసాద్ మాట్లాడుతూ హెచ్‌ఎండీఏలో కొన్నేళ్లుగా ఉద్యోగుల నియమాకాలు జరగడం లేదని, రాను రాను మరింత బలహీనపడుతుందన్నారు. ఉద్యోగుల నియమాకాలు జరిపేందుకు ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో అధికారులు విద్యాధర్, పరంజ్యోతి, వీరారెడ్డి, చంద్రారెడ్డి, సత్యనారాయణ మూర్తి, జానకీరామ్ రెడ్డి, విజయలక్ష్మిలతో పాటు ఉద్యోగుల సంఘం నాయకులు విజయ్‌కుమార్, శ్రీనివాస్, రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

పంజాగుట్ట, జూలై26(ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాలలో జర్నలిస్టుల సంక్షేమానికి ప్రత్యేకంగా జర్నలిస్ట్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, జర్నలిస్టులపై దాడులను అరికట్టాలని తెలుగు జర్నలిస్టుల సంక్షేమ సంఘం, తెలంగాణ జర్నలిస్టుల సంక్షేమ సంఘం ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశాయి. ప్రజాగళాన్ని తన కలంగా మార్చుకుని వివిధ విభాగాల్లో ఉత్తమ సేవలు అందించిన జర్నలిస్టులకు పురస్కారాలు అందజేస్తున్నామని, ఆయా సంఘాల వ్యవస్థాపక అధ్యక్షులు మేడవరపు రంగనాయకులు, అనంచిన్ని వేంకటేశ్వరరావులు తెలిపారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో పురస్కార గ్రహీతల వివరాలను వారు ప్రకటించారు. వారు మాట్లాడుతూ ఉగాది పురస్కారాలు కార్యక్రమంలో భాగంగా వచ్చిన దరఖాస్తులలో నుంచి 40 విభాగాలలో 41 మంది జర్నలిస్టులను ఎంపిక చేసినట్లు తెలిపారు. వారికి అవార్డుతో పాటు రూ.5వేల నగదు పురస్కారం కూడా అందజేస్తున్నట్లు వివరించారు. త్వరలో రవీంద్రభారతిలో పురస్కారాల ప్రదానోత్సవం ఉంటుందని తెలిపారు. సమావేశంలో మిద్దెల జితేందర్, గజ్జల శ్రీనివాస్, నాయకులు జి. శ్రీనివాస్, బోడపాటి సుబ్బారావు, బి.కృష్ణ మోహన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పోస్టల్ శాఖ సేవలను వినియోగించుకోవాలి

పంజాగుట్ట, జూలై26(ఆంధ్రజ్యోతి): పోస్టల్ శాఖ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఖైరతాబాద్ బ్రాంచ్ మేనేజర్ జేఎస్ఎంవిఆర్. ప్రసాద్ అన్నారు. శుక్రవారం ప్రేమ్‌నగర్ అంబేద్కర్ భవన్‌లో డాక్ కమ్యూనిటీ డెవలప్మెంట్ ప్రోగ్రాంలో భాగంగా పోస్టల్ శాఖ అందిస్తున్న పథకాలు, వాటి ప్రయోజనాల గురించి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు రెండు రోజులపాటు ఆధార్ కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేశామని, ఆధార్ కార్డులో తప్పులను సరిచేసుకోవచ్చునన్నారు. అలాగే పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన క్విజ్ పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో దాసరి విశ్వనాథ్, కె.భగవాన్ దాస్, సిబ్బంది పాల్గొన్నారు.

మైనారిటీలకు నిధుల కేటాయింపుపై హర్షం


బుర్హానుద్దీన్‌ను సన్మానిస్తున్న మైనారిటీ నాయకులు

బంజారాహిల్స్, జూలై 26(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్ రెడ్డి మైనారిటీలకు ప్రాధాన్యత ఇస్తూ బడ్జెట్‌లో నిధులు కేటాయించడంపై ఏఐసీసీ కర్ణాటక రాష్ట్ర పరిశీలకులు సయ్యద్ బుర్హానుద్దీన్ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసానికి వచ్చిన పలువురు మైనార్టీ నేతలు ఆయనను సన్మానించారు. ఈసందర్భంగా బుర్హానుద్దీన్ మాట్లాడుతూ.. గతంలో ఏ ప్రభుత్వం తీసుకొని నిర్ణయాన్ని ఈ ప్రభుత్వం తీసుకొని మైనార్టీలకు అధిక ప్రాధాన్యం కల్పించిందన్నారు. రాష్ట్రంలోని ప్రతీ వర్గానికి అనుగుణంగా ఈ బడ్జెట్ రూపకల్పన ఉందన్నారు. మైనారిటీల తరపున ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

ఫోన్ నంబర్ ఇవ్వలేదని యువతితో అసభ్య ప్రవర్తన

యూసుఫ్‌గూడ, జులై 26 (ఆంధ్రజ్యోతి): ఫోన్ నంబర్ ఇవ్వలేదని ఓ యువతితో గుర్తు తెలియని యువకుడు అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఆ యువతి స్థానిక హాస్టల్‌లో నివాసం ఉంటూ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్నది. 24న మధ్యాహ్నం హోటల్‌కు వెళ్లి వస్తున్న సమయంలో గుర్తు తెలియని యువకుడు వచ్చి ఫోన్ నంబరు అడిగాడు. నిరాకరించడంతో ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో ఆ యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

పేకాట రాయుళ్ల అరెస్ట్

యూసుఫ్‌గూడ, జులై 26 (ఆంధ్రజ్యోతి): గుట్టు చప్పుడు కాకుండా పేకాట ఆడుతున్న వ్యక్తులపై మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. రహ్మత్‌నగర్‌లో ఏళ్లుగా గుట్టుచప్పుడు కాకుండా ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఇన్‌స్పెక్టర్ మధుసూధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ సాయినాథ్‌రెడ్డి తన సిబ్బందితో పేకాట స్థావరంపై దాడి చేశారు. నిర్వాహకుడు పి.మాలాద్రితో పాటు ఆడుతున్న బి.తారకేశ్వరరావు, టి.శంకర్‌రావు, ఎస్.రామ్మోహన్‌రావు, ఇ.రాజు, బి.సత్యనారాయణ అరుగురు వ్యక్తులను పట్టుకున్నారు. వారి వద్ద ఉన్న రూ.50వేలు నగదు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెళ్లి చేసుకుంటానని మోసం చేసిన నటుడిపై కేసు

బేగంపేట, జూలై 26(ఆంధ్రజ్యోతి): పెళ్లి చేసుకుంటానని నమ్మించి మహిళపై పలుమార్లు అఘాయిత్యానికి పాల్పడ్డ ఓ సినీనటుడిపై బేగంపేట పీఎస్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్యాంలాల్ బిల్డింగ్ వద్ద ఉండే ఓ మహిళ (34)కు దగ్గరలో ఉండే బ్రాహ్మణవాడికి చెందిన సినీ నటుడు అమన్‌సింగ్(27)తో జిమ్‌లో పరిచయం ఏర్పడింది. అది కాస్త ప్రేమగా మారడంతో పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి పలుమార్లు తన ఫ్లాట్‌కు రప్పించుకొని అఘాయిత్యానికి పాల్పడ్డాడు. అలాగే ఆమె వద్ద రూ.15 లక్షలు తీసుకున్న అమన్ తప్పించుకొని తిరుగుతుండడంతో అనుమానం వచ్చిన ఆమె నిలదీసింది. తాను పెళ్లి చేసుకోనని, బలవంతం చేస్తే తన వద్ద నున్న ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో పోస్టు చేస్తానని బెదిరించాడు. దీంతో బాధితురాలు బేగంపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బోనాలకు రావాలంటూ సీఎం, డిప్యూటీ సీఎంలకు ఆహ్వానం


సీఎం రేవంత్‌కు ఆహ్వానం పత్రం అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు


డిప్యూటీ సీఎం భట్టివిను ఆహ్వానిస్తున్న కమిటీ ప్రతినిధులు

ఖైరతాబాద్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): బోనాల పండగకు ఖైరతాబాద్‌లోని ఆలయాలు ముస్తాబయ్యాయి. కాగా, ఖైరతాబాద్ మహాకాళి దేవాలయానికి పూజలకు రావాలని కోరుతూ ఆలయ చైర్మన్ భవానీ కృష్ణ యాదవ్, ప్రతినిధులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలసి ఆహ్వానించారు. శుక్రవారంరాత్రి ఆయనను సచివాలయంలో కలసిన బృందం ప్రత్యేకంగా ఆహ్వాన పత్రం అందజేశారు. అనంతరం క్యాంపు కార్యాలయంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను కలిసిన ఆలయ కమిటీ ఆహ్వానించింది. ఇందులో ఆలయ అర్చకులు కృష్ణ, ప్రతినిధులు మధుకర్‌యాదవ్, అనిల్‌కుమార్, లక్ష్మణ్ యాదవ్, బాలయ్య, శ్రీశైలం యాదవ్, రాము యాదవ్, రాజ్‌కిరణ్, సుజిత్ స్థానిక ముఖ్య నాయకులు తదితరులు ఉన్నారు.

రాజశ్యామల యాగ నిర్వహణకు మద్దతివ్వండి


వినతి పత్రం అందజేస్తున్న నిర్వాహకులు

అమీర్‌పేట, జూలై 26(ఆంధ్రజ్యోతి): సమాజ శ్రేయస్సు కోసం నిర్వహించ తలపెట్టిన రాజశ్యామల సహిత చండీ యాగానికి సీఎం రేవంత్ రెడ్డి మద్దతు ఇప్పించాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోట నీలిమను దూప దీప నైవేద్య అర్చక సంఘం కోరింది. ఈ మేరకు గురువారం అమీర్‌పేట పార్టీ కార్యాలయంలో శుక్రవారం కలిసిన వారు వినతి పత్రం అందజేశారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ఆమె ఈ యాగానికి ఉన్న సంస్కృతిక ప్రాముఖ్యత విషయం ముఖ్యమంత్రితో చర్చించి యాగ నిర్వహణకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో దూప దీప నైవేద్య అర్చక సంఘం గౌరవ అధ్యక్షులు వాసుదేవ శర్మ, సంస్థ సహచరులు తదితరులున్నారు.

పార్టీలు మారడం కాదు.. అభివృద్ధికి నిధులేవి?

ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై మాజీ ఎమ్మెల్యే చింతల విసుర్లు


రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న చింతల రామచంద్రారెడ్డి, తదితరులు

ఖైరతాబాద్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన హామీలను తుంగలో తొక్కుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజలకు ఏమాత్రం ఉపయోగకరంగా లేదని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల రామచంద్రారెడ్డి అన్నారు. బడ్జెట్‌ను నిరసిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం ఖైరతాబాద్ చౌరస్తాలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. నేతలు ప్లకార్డులు ప్రదర్శిస్తూ ర్యాలీగా ఖైరతాబాద్ చౌరస్తాకు వచ్చి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా చింతల మాట్లాడుతూ ఖైరతాబాద్‌లో పార్టీలు మారడంలో ఆసక్తి చూపే ఎమ్మెల్యే దానం నియోజకవర్గానికి ఎన్ని నిధులు తెప్పించారో చెప్పాలని ప్రశ్నించారు. రైతులను, నిరుద్యోగులను, యువతను, మహిళలకు ప్రభుత్వం మభ్యపెట్టి బడ్జెట్‌లో కేటియింపులు ఇవ్వక మోసగించిందన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు ఆదర్శ్ వంశీకర్, నాయకులు మేచినేని శ్రీనివాసరావు, గడ్డం వెంకటస్వామి, ప్రసాద్, నర్సింగ్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

యూసుఫ్‌గూడ బస్తీలో..


దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

యూసుఫ్‌గూడ, జులై 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌పై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడంపై బీజేపీ నేతలు నిరసనగా ఆయన దిష్టిబొమ్మను యూసుఫ్‌గూడ బస్తీ వద్ద దహనం చేశారు. కార్యక్రమంలో కుంబాల గంగరాజు, ప్రేమ్‌కుమార్, అట్లూరి రామకృష్ణ, అనంతలక్ష్మి, చంద్రమోహన్, విజయ్, రాజేష్, సంగీత, సునిత, ఈశ్వర్, శివ, గణేష్ పాల్గొన్నారు.


ప్రదర్శనను తిలకిస్తున్న సీనియర్ ఆర్టిస్ట్ అంజు పొద్దర్, తదితరులు

ఆర్ట్ గ్యాలరీలో చిత్ర ప్రదర్శన ప్రారంభం

మాదాపూర్, జూలై26(ఆంధ్రజ్యోతి): మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్‌గ్యాలరీలో శుక్రవారం కళాకారిణి రమణి మైలవరపు రూపొందించిన పలు చిత్రాలతో ఏర్పాటు చేసిన వాయిసెస్ ఆఫ్ ది వేవ్స్, ది స్టోరీ ఆఫ్ ఫిషర్‌ఫోక్ డిజిటల్ వర్క్ ఆఫ్ ఫొటో ప్రదర్శనను సీనియర్ ఆర్టిస్ట్ అంజు పొద్దర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం కళాకారిణి రమణి, పార్వతిరెడ్డి, ఆనంద్ గడపలతో కలిసి ప్రదర్శనలోని చిత్రాలను తిలకించారు. ఈ చిత్ర ప్రదర్శన జూలై 29వ తేదీ వరు కొనసాగుతుందని ఆర్ట్‌గ్యాలరీ నిర్వాహకులు తెలిపారు.

సీఎం రేవంత్‌రెడ్డిపై బీజేపీ విమర్శలు సిగ్గుచేటు


ప్రధాని మోదీ దిష్టి బొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

అమీర్‌పేట, జూలై 26(ఆంధ్రజ్యోతి): బడ్జెట్‌లో తెలంగాణకు నయా పైసా కేటాయించలేని కేంద్రాన్ని ప్రశ్నించలేని బీజేపీ నేతలు సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం సిగ్గుచేటని కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షులు శ్రీనివాసరావు మండిపడ్డారు. అమీర్‌పేటలో సీఎం దిష్టిబొమ్మను బీజేపీ నాయకులు దహనం చేయడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందుకు నిరసనగా శుక్రవారం సత్యం టాకీస్ చౌరస్తాలో పార్టీ శ్రేణులతో కలిసి ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండుసార్లు గెలిచిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సనత్‌నగర్ నియోజకవర్గ అభివృద్ధికి ఏం చేశారో బీజేపీ నేతలు చెప్పాలన్నారు. సికింద్రాబాద్ పార్లమెంట్‌లో ఆయన చేసిన అభివృద్ధిపై బీజేపీ నాయకులు చర్చకు రావాలని సవాలు విసిరారు. బీఆర్ఎస్ పార్టీతో రహస్య ఒప్పందం చేసుకున్న బీజేపీ నాయకులు కేసీఆర్ ఆదేశాలతో సీఎం రేవంత్ పై విమర్శలు చేస్తున్నారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో నవీన్ రాజు, రవీందర్, గోపాల్, సురేష్ కుమార్, ప్రతాప్ నాయక్ పాల్గొన్నారు.

28న మిద్దె తోటల ఏర్పాటు, నిర్వహణపై అవగాహన సదస్సు

ఖైరతాబాద్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): రైతు నేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో కర్షక సేవా కేంద్రం నిర్వహణలో నగరంలో మిద్దె తోటల ఏర్పాటు, నిర్వహణలో ఉచిత అవగాహన సదస్సు ఏర్పాటు చేస్తున్నట్లు రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్, పద్మశ్రీ యడ్లపల్లి వెంకటేశ్వరరావు తెలిపారు. టెర్రస్ గార్డెనింగ్, బాల్కనీ గార్డెనింగ్, కిచెన్ గార్డెనింగ్‌లను సేంద్రియ పద్ధతిలో కూరగాయలతో పాటు పూలు, పండ్లు పండించవచ్చుననే విషయమై నగరవాసులకు అవగాహన కల్పించేందుకు ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

జూలై 28 ఆదివారం చింతలబస్తీలోని దక్షిణ భారత హిందీ ప్రచార సభలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంటల వరకు ఈ సదస్సు ఉంటుందని, ఇతర వివరాలకు 9553825532 నంబర్‌లో సంప్రదించవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొనే వారందరికీ కూరగాయలు, ఆకుకూరల విత్తనాలు ఉచితంగా అందజేస్తామన్నారు.

భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు

పంజాగుట్ట, జూలై26(ఆంధ్రజ్యోతి): బోనాల పండుగ సందర్భంగా ఆలయాల వద్ద భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని వెంగళరావునగర్ డివిజన్ కార్పొరేటర్ దేదీప్య అన్నారు.శుక్రవారం జీహెచ్ఎంసీ ఏఈ అవినాష్, విద్యుత్ శాఖ ఏఈ తిరుపతయ్య, జలమండలి డీజీఎం వాహబ్, వీధి దీపాల విభాగం అధికారి బాలరాజులతో కలిసి ఆమె డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లోని అమ్మవారి ఆలయాలను సందర్శించారు. నిర్వాహకులను అడిగి అక్కడ ఉన్న సమస్యలను తెలుసుకున్నారు. వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆమె సూచించారు. వారి వెంట స్థానిక బీఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.



పలహారం బండి ఊరేగింపును ప్రారంభించిన మాజీ బోర్డు సభ్యురాలు ప్యారసాని భాగ్యశ్రీ

ఘనంగా ముగిసిన లాల్‌బజార్ బోనాలు

తిరుమలగిరి, జులై 26 (ఆంధ్రజ్యోతి): లాల్‌బజార్‌లో రెండు రోజుల పాటు జరిగిన బోనాల జాతర గురువారం రాత్రి ఘనంగా ముగిసింది. రెండో రోజు అమ్మవారికి ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు చేశారు. సికింద్రాబాద్ హైదరాబాద్‌కు చెందిన భక్తులతో పాటు తిరుమలగిరి లాల్‌బజార్‌కు చెందిన మహిళలు, చిన్నారులు, పెద్దలు భారీ ఎత్తున తరలివచ్చి అమ్మవారికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు పోతరాజుల నృత్యాలు, శివసత్తుల పూనకాలు తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు అద్దం పట్టే డప్పులదరువుల నడుమ ఫలహారం బండ్ల ఊరేగింపు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఆలయ కమిటీ నిర్వాహకులు దేవాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వేదిక నుంచి ఫలహారం బండ్లకు స్వాగతం పలికారు. తిరుమలగిరి విలేజ్ లాల్‌బజార్ తదితర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున ఫలహారం బండ్లు ఊరేగింపుగా వచ్చి అమ్మవారిని దర్శించుకుని తిరిగి వెళ్లాయి. భవిష్యవాణి అనంతరం అమ్మవారికి గుమ్మడికాయను బలి ఇచ్చి బలితోపాటు అమ్మవారిని గ్రామ పొలిమేర వరకు సాగనంపారు. అంతకు ముందు సాయంత్రం పోతరాజు దినేష్ గౌడ్ పోతరాజు వేషధారణలో జాతరలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు.



మీడియాతో మాట్లాడుతున్న మనోహర్‌రెడ్డి, సురిటి కామేశ్వర్

అందరి సహకారంతో బోనాల జాతర సక్సెస్

సికింద్రాబాద్, జులై 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు, అన్ని శాఖల అధికారులు, ఆలయ సిబ్బంది, భక్తులు, స్వచ్ఛంద, సేవా సంస్థల సహకారంలో ఈ ఏడాది సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాకాళి అమ్మవారి బోనాల జాతర ప్రశాంతంగా, అంగరంగ వైభవంగా జరిగిందని ఉజ్జయినీ మహాకాళి ఆలయ కార్యనిర్వహణాధికారి మనోహర్‌రెడ్డి, ఆలయ అనువంశిక ధర్మకర్త సురిటి కామేశ్వర్‌రావులు తెలిపారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా బోనాల జాతరను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నామని వారు చెప్పారు. శుక్రవారం ఉజ్జయినీ మహాకాళి ఆలయంలో వారు మీడియాతో మాట్లాడారు. ఈ ఏడాది బోనాల జాతరకు 15లక్షల మందికిపైగా భక్తులు తరలి వచ్చారని, అమ్మవారి ఆశీస్సులు అందుకున్నారని అంచనా వేశారు. దేవాదాయ, పోలీసు, జీహెచ్ఎంసీ, వాటర్ బోర్డు, విద్యుత్, వైద్య, ఆరోగ్య, ఆర్టీసీ, ఆర్ అండ్ బీ, సాంస్కృతిక తదితర శాఖల అధికారులు, ఉద్యోగులు తమకు సహకరించారని చెప్పారు. అందరికీ ఉజ్జయినీ మహాకాళి అమ్మవారి ఆశీస్సులు ఎల్లకాలం ఉంటాయని పేర్కొన్నారు.



గంజాయిని పట్టుకున్న సికింద్రాబాద్ జీఆర్‌పీ పోలీసులు

విశాఖ ఎక్స్‌ప్రెస్‌లో గంజాయి పట్టివేత

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, జులై 26 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న రైల్వే పోలీసులు, సికింద్రాబాద్ ఆర్పీఎఫ్ పోలీసులు విశాఖ ఎక్స్‌ప్రెస్ రైలులో తనిఖీ చేయగా ఓ వ్యక్తి నుంచి 17కిలోల గంజాయిని పట్టుకున్నారు. సికింద్రాబాద్ రైల్వే డీఎస్పీ జావీద్ తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో సికింద్రాబాద్ జీఆర్పీ, సికింద్రాబాద్ ఆర్పీఎఫ్ పోలీసులు జీఆర్పీ సీఐ సాయి ఈశ్వర్‌గౌడ్, ఎస్సై మాజీద్, రమేష్, ఆర్పీఎఫ్ ఎస్సై గోవింద్ నాయుడు సంయుక్తంగా కలిసి జనరల్ చెకింగ్ చేస్తున్నారు. ఆ సమయంలో రైల్వే స్టేషన్‌లో ఆగిన విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్ రైలులో తనిఖీలు చేస్తుండగా మహారాష్ట్రకు చెందిన కృష్ణ అంబోర్ (21) వద్ద ఉన్న లగేజీని తనిఖీ చేయగా ఇతని వద్ద నుంచి రూ.4.10లక్షల విలువ చేసే 17కిలోల గంజాయిని పట్టుకున్నారు. నిందితుడిని అరెస్టు చేశామని డీఎస్పీ తెలిపారు. గంజాయిని రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.



బాలుడిని చేరదీసిన ఆర్పీఎఫ్ పోలీసులు

ఇంటి నుంచి పారిపోయి వచ్చిన బాలుడు

- చేరదీసిన ఆర్పీఎఫ్ పోలీసులు

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, జులై 26 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి చెప్పకుండా రైల్వే స్టేషన్‌కు వచ్చిన ఓ బాలుడిని నాంపల్లి ఆర్పీఎఫ్ పోలీసులు పట్టుకుని చైల్డ్‌లైన్‌కు అప్పగించారు. నాంపల్లి ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కల్పన తెలిపిన వివరాల ప్రకారం.. రాజస్థాన్‌కు చెందిన 15ఏళ్ల బాలుడు ఇంటి నుంచి పారిపోయి శుక్రవారం నాంపల్లి రైల్వే స్టేషన్‌కు వచ్చాడు. ఆ సమయంలో నాంపల్లి ఆర్పీఎఫ్ పోలీసులు ఒంటరిగా ఉన్న బాలుడిని చేరదీసి వివరాలు సేకరించారు. ఇంటి నుంచి పారిపోయి వచ్చానని చెప్పడంతో ఆర్పీఎఫ్ పోలీసులు చైల్డ్‌లైన్‌కు అప్పగించారు. తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చిన అనంతరం ఐడీ కార్డులను పరిశీలించి అప్పగించేందుకు చైల్డ్‌లైన్ సిబ్బంది తల్లిదండ్రులకు అప్పగిస్తారన్నారు.

మరో ఘటనలో :

నాంపల్లి రైల్వే స్టేషన్‌లో ఒంటరిగా ఉన్న బాలికను ఆర్పీఎఫ్ పోలీసులు చైల్డ్‌లైన్‌కు అప్పగించారు. జార్ఖండ్‌కు చెందిన 15ఏళ్ల బాలిక శుక్రవారం నాంపల్లి రైల్వే స్టేషన్‌లో ఒంటరిగా కనిపించడంతో ఆర్పీఎఫ్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. తల్లిదండ్రుల నుంచి పారిపోయి వచ్చానని చెప్పడంతో బాలికను ప్రభుత్వ చైల్డ్‌లైన్‌కు అప్పగిస్తామని నాంపల్లి ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కల్పన తెలిపారు.

గాంధీ సూపరింటెండెంట్ డా.రాజకుమారిని కలిసిన సీఐ అనుదీప్



గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా ఇటీవల పదవీ బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ రాజకుమారిని శుక్రవారం చిలకలగూడ పోలీస్‌స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అనుదీప్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆస్పత్రిలో శాంతి భద్రతల అంశంపై కాసేపు చర్చించారు.

- అడ్డగుట్ట, ఆంధ్రజ్యోతి



చిలకలగూడలో విద్యుత్ కాంతులతో కట్టమైసమ్మ పోచమ్మ ఆలయం



వారాసిగూడలోని పోచమ్మ ఆలయం



కట్టమైసమ్మ, పోచమ్మ అమ్మవారికి వడిబియ్యం పోస్తున్న మహిళలు

బోనాలకు ముస్తాబైన ఆలయాలు

- రేపు చిలకలగూడ, వారాసిగూడలో బోనాల జాతర

బౌద్ధనగర్, జులై 26 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ నియోజకవర్గంలోని సీతాఫల్‌మండి, బౌద్ధనగర్ డివిజన్‌లలో 28, 29వ తేదీల్లో ఆది, సోమవారం ఆషాఢమాస బోనాలు ఘనంగా జరుగనున్నాయి. ఇప్పటికే ఆలయాలను విద్యుత్ కాంతులతో సుందరంగా ముస్తాబు చేశారు. చిలకలగూడ, వారాసిగూడ పోలీస్‌స్టేషన్ల పరిధిలోని చిలకలగూడ, వారాసిగూడ, బీదలబస్తీ, శ్రీనివాస్‌నగర్ కాలనీ, బౌద్ధనగర్, ఎల్.నారాయణనగర్ తదితర ప్రాంతాల్లోని 21 ఆలయాల్లో బోనాల పండుగను నిర్వహించనున్నారు. ముఖ్యంగా చిలకలగూడలోని కట్టమైసమ్మ, పోచమ్మ ఆలయంలో జరిగే బోనాలకు సుమారు లక్షమంది భక్తులు హాజరుకానున్నారు. ఈ బోనాల వేడుకల్లో కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, సికింద్రాబాద్ శాసనసభ్యుడు తీగుళ్ల పద్మారావుగౌడ్, స్థానిక కార్పొరేటర్లు సామలహేమ, కంది శైలజ, టీపీసీసీ కార్యదర్శి ఆదం సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొననున్నారు. రాష్ట్రమంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చిలకలగూడలోని కట్టమైసమ్మ, పోచమ్మ అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పిస్తారని ఆలయ చైర్మన్ గుంటికృష్ణ తెలిపారు. బోనాలను పురస్కరించుకుని ఆలయాల వద్ద భారీ బందోబస్తును ఏర్పాటుచేశామని ఇన్‌స్పెక్టర్లు అనుదీప్, సైదులు తెలిపారు.

భక్తులకు ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు

- ఈఓ మహేందర్‌గౌడ్

చిలకలగూడలోని కట్టమైసమ్మ-పోచమ్మ బోనాలకు విచ్చేసే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ కార్యనిర్వహణాధికారి మహేందర్‌గౌడ్ తెలిపారు. ఆలయంలో బోనాలు సమర్పించే మహిళల కోసం ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. పోలీస్ అధికారులు, వివిధ విభాగాల అధికారులతో సంప్రదించి తగిన చర్యలు తీసుకున్నామన్నారు. ఆలయ ఆవరణలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. అన్ని పార్టీల నాయకులు సహకరించి ఆషాఢ బోనాలు సవ్యంగా జరిగేలా చూడాలని ఆయన కోరారు.



మధురానగర్ కాలనీలో బంగారు మైసమ్మ అమ్మవారు



బోనాల జాతరకు ఫలహారం బండ్ల నిర్వాహకులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఏసీపీ గోపాలకృష్ణ, ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణరెడ్డి, డీఐ సర్దార్ నాయక్

బోనాల జాతరపై పోలీసుల ప్రత్యేక నిఘా

బోయిన్‌పల్లి, జులై 26 (ఆంధ్రజ్యోతి): బోనాల జాతరను పురస్కరించుకుని పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు, అల్లర్లకు పాల్పడేవారిపై కేసులు పెట్టి జైలుకు తరలిస్తామని బేగంపేట్ ఏసీపీ గోపాలకృష్ణమూర్తి పేర్కొన్నారు. ఆది, సోమవారాలు బోయిన్‌పల్లి బోనాలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న పోచమ్మ ఆలయాలు, ముత్యాలమ్మ ఆలయాలతో పాటు బోనాల ఫలహారాల బండ్లను నిర్వహించే నిర్వాహకులతో బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణరెడ్డి ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా పాల్గొన్న బేగంపేట్ ఏసీపీ గోపాలకృష్ణమూర్తి మాట్లాడుతూ నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ముఖ్యంగా బోనాల పండుగ రోజు అల్లర్లకు పాల్పడితే ఎంతటివారైనా ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగ వాతావరణంలో బోనాల జాతరను జరుపుకోవాలని అన్నారు. ఆలయాల వద్ద ప్రత్యేక క్యూలైన్‌లను ఏర్పాటుచేసుకోవాలని సూచించారు. ఫలహారాల బండ్లను తీసేవారు జాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు. ఆలయాల కమిటీ సభ్యులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జాతర సందర్భంగా వేసే స్టేజీలకు పోలీసుల అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బోయిన్‌పల్లి డీఐ సర్దార్ నాయక్, ఎస్ఐ శివశంకర్, నాగేంద్రబాబులతో పాటు బోయిన్‌పల్లి పీస్ కమిటీ సభ్యులు సోషల్ సర్వీస్ సభ్యులు వివిధ మతపెద్దలు, వివిధ ఆలయాల కమిటీ సభ్యులు నిర్వాహకులు పాల్గొన్నారు.



సెల్‌ఫోన్ దొంగలను అరెస్టు చేసిన ఆర్పీఎఫ్ పోలీసులు

రైల్వే స్టేషన్‌లో సెల్‌ఫోన్ దొంగల అరెస్ట్

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, జులై 26 (ఆంధ్రజ్యోతి): రైల్వే స్టేషన్‌లో సెల్‌ఫోన్ దొంగలను సికింద్రాబాద్ డివిజన్ ఆర్పీఎఫ్ రుద్రమ్మ శక్తి మహిళా కానిస్టేబుళ్లు పట్టుకున్నారు. బేగంపేట్ ఆర్పీఎఫ్ ఎస్సై నసీమా తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌తో పాటు ఖాజీపేట్ రైల్వే స్టేషన్‌లో గురువారం మధ్యరాత్రి ఇద్దరు వ్యక్తులు తచ్చాడుతుండగా ఆ సమయంలోనే సికింద్రాబాద్ డివిజనల్ ఆర్పీఎఫ్ రుద్రమ్మ శక్తి మహిళా కానిస్టేబుళ్లు మాదూరిసింగ్, వందన, సుధ, లావణ్య, డాలీ, రాధలు కలిసి ఇద్దరు వ్యక్తుల్ని విచారించడంతో రైలు ప్రయాణికుల సెల్‌ఫోన్ దొంగతనం చేస్తున్నామని నేరం ఒప్పుకున్నారు. నిందితుల నుంచి రెండు సెల్‌ఫోన్లు, ఏటీం కార్డులు స్వాధీనం చేసుకున్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిపై బీజేపీ విమర్శలు సిగ్గుచేటు

అమీర్‌పేట, జులై 26(ఆంధ్రజ్యోతి): బడ్జెట్‌లో తెలంగాణకు నయాపైసా కేటాయించలేని కేంద్రాన్ని ప్రశ్నించలేని బీజేపీ నేతలు సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం సిగ్గుచేటని కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షులు శ్రీనివాసరావు మండిపడ్డారు. అమీర్‌పేటలో సీఎం దిష్టిబొమ్మను బీజేపీ నాయకులు దహనం చేయడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందుకు నిరసనగా శుక్రవారం సత్యం టాకీస్ చౌరస్తాలో పార్టీ శ్రేణులతో కలిసి ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండుసార్లు గెలిచిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సనత్‌నగర్ నియోజకవర్గ అభివృద్ధికి ఎం చేశారో బీజేపీ నేతలు చెప్పాలన్నారు. సికింద్రాబాద్ పార్లమెంట్‌లో ఆయన చేసిన అభివృద్ధిపై బీజేపీ నాయకులు చర్చకు రావాలని సవాలు విసిరారు. బీఆర్ఎస్ పార్టీతో రహస్య ఒప్పందం చేసుకున్న బీజేపీ నాయకులు కేసీఆర్ ఆదేశాలతో సీఎం రేవంత్ పై విమర్శలు చేస్తున్నారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో నవీన్ రాజు, రవీందర్, గోపాల్, సురేష్ కుమార్, ప్రతాప్ నాయక్ పాల్గొన్నారు.



వాలీబాల్ విజేతలకు ట్రోఫీని అందజేస్తున్న కరెస్పాండెంట్ పి.జ్యోతి మధుసూదనరావు

విద్యతో పాటు క్రీడలకు ప్రాముఖ్యం అవసరం

మారేడుపల్లి, జులై 26 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా ఎంతో అవసరమని, క్రీడలు ఆడటం వలన విద్యార్థుల శారీరక దృఢత్వాన్ని పెంపొందించుటకు ఉపయోగపడతాయని ద సికింద్రాబాద్ పబ్లిక్ స్కూల్ కరెస్పాండెంట్ పి.జ్యోతి మధుసూదన రావు పేర్కొన్నారు. ది సికింద్రాబాద్ పబ్లిక్ స్కూల్ సహకారంతో రుక్మిణి బాయ్ స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో అంతర్ పాఠశాలల క్రీడా పోటీలు రెండు రోజులుగా పాఠశాల ప్రాంగణంలో జరుగుతున్నాయి. శుక్రవారం వాలీబాల్ మాస్టర్ ఆర్ట్స్ టేబుల్ టెన్నిస్ పోటీలకు సంబంధించిన ఫైనల్ పోరు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న సికింద్రాబాద్ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ పి.జ్యోతి, ప్రిన్సిపల్ సుజాత, కోచ్‌లు, విజేతలకు ట్రోఫీలను బహుమతులతో పాటు నగదు బహుమతులను అందజేశారు. అనంతరం క్రీడలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఆమె ప్రత్యేకంగా అభినందించారు. టేబుల్ టెన్నిస్ బాలికల విభాగంలో డబుల్స్‌లో శాన్వి, హారిక ఉప్పల్ విజేతలుగా నిలవగా రహమత్ ఉన్నీసా యజ్ఞశ్రీ డాన్ బాస్కో స్కూల్ రన్నర్స్‌గా నిలిచారు. బాలుర విభాగంలో రహమాన్ దాస్ ఆరాధ్య చిరాక్ పబ్లిక్ స్కూల్ కొండపూర్ విజేతలుగా నిలవగా, అనీషత్ రోహన్ చిరాక్కు పబ్లిక్ స్కూల్ కొండాపూర్‌లో రన్నర్స్‌గా నిలిచి ట్రోఫీలను గెలుచుకున్నారు. ఈ కార్యక్రమంలో విజేతలను ముఖ్య అతిథులుగా పాల్గొన్నటువంటి వివిధ పాఠశాలల ప్రిన్సిపల్‌లు, పీఈటీలు క్రీడాకారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్స్ శిల్ప, రవి, స్వాతి, పూజ, కోచ్ లక్ష్మీకాంత్, అకాడమి డైరెక్టర్ అగస్టిన్, ప్రిన్సిపల్ సుజాతతో పాటు నగరానికి చెందిన వివిధ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'చరిత్రలో గుర్తుండిపోయే కార్గిల్ యుద్ధం'

మారేడుపల్లి, జులై 26 (ఆంధ్రజ్యోతి): కార్గిల్ యుద్ధం భారతదేశ చరిత్ర ఉన్నంత వరకు గుర్తుండిపోయే యుద్ధమని కస్తూర్బా గాంధీ డిగ్రీ, పీజీ మహిళా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.రాజేశ్వరి అన్నారు. తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ స్వచ్ఛంద సంస్థ రాష్ట్ర శాఖ అధ్వర్యంలో సికింద్రాబాద్‌లోని మారేడ్‌పల్లిలోని కస్తూర్బా గాంధీ డిగ్రీ, పీజీ మహిళా కళాశాలలో భారీ ర్యాలీ ఎన్ఎస్ఎస్ యూనిట్ వన్ టి బెటాలియన్ విద్యార్థినులతో శుక్రవారం కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా ఏర్పాటు చేసిన ర్యాలీలో ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. భారత సైనికుల త్యాగాలను, భారతదేశంలోని ప్రతి పౌరుడు గుర్తించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ ఆఫీసర్ మేజర్ డాక్టర్ డి.జయసుధ, ఆర్మీ సుబేదార్ ఎం.కె.సింగ్, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ రాయల్ డిస్ట్రిక్ట్ చైర్‌పర్సన్ లయన్ గోపిశెట్టి ప్రమోద్, కాలేజ్ చైర్మన్ నరోత్తం రెడ్డి, కార్యదర్శి ఫహిముద్దీన్, ఎన్‌సీసీ బెటాలియన్ హవల్దార్ జితేందర్ తివారి, కుమారి కోకిల, కుమారి అనుజ్ఞ, కుమారి మహిమ పాల్గొన్నారు.



కార్గిల్ విజయ్ దివస్ 25 ఏళ్ల సందర్భంగా కస్తూర్బా గాంధీ మహిళా డిగ్రీ కళాశాలలో భారీ ర్యాలీ

లాన్స్‌నాయక్ రాంచందర్‌కు ఘన నివాళి



లాన్స్ నాయక్ రాంచందర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న టీపీసీసీ కార్యదర్శి డాక్టర్ కే.నరసింహన్

తిరుమలగిరి, జులై 26 (ఆంధ్రజ్యోతి): కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా వీరమరణం పొందిన బొల్లారం ప్రాంతానికి చెందిన లాన్స్‌నాయక్ రాంచందర్ విగ్రహానికి శుక్రవారం టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ కే.నరసింహన్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నరసింహన్ లాన్స్ నాయక్ రాంచందర్ దేశానికి చేసిన సేవలు కొనియాడారు.

చిన్న వయసులోనే అత్యంత ధైర్య సాహసాలతో కార్గిల్ యుద్ధంలో పాక్ సైన్యంతో పోరాటం చేసి వీర మరణం పొందడం దేశంతో పాటు సికింద్రాబాద్ బొల్లారం ప్రాంతానికి కూడా గర్వకారణం అని అన్నారు.

యువత లాన్స్‌నాయక్ రాంచందర్ స్ఫూర్తిని తీసుకుని దేశ భద్రత కోసం సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో జీవీ బాల్‌రాజ్, భీమయ్యలు ఉన్నారు. లాన్స్ నాయక్ రాంచందర్ విగ్రహానికి సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు.



పరేడ్‌గ్రౌండ్‌లోని అమరవీరుల స్మారక స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న జంపన ప్రతాప్

- లాన్స్‌నాయక్ రాంచందర్‌ను మరచిన కంటోన్మెంట్ అధికారులు

సికింద్రాబాద్ కంటోన్మెంట్‌కు చెందిన లాన్స్‌నాయక్ రాంచందర్ విగ్రహాన్ని బొల్లారం బజార్‌లో ఏర్పాటు చేసిన విగ్రహం అందరికీ తెలిసిన విషయమే అయితే కంటోన్మెంట్ అధికారులు ప్రతి సంవత్సరం ఆయనకు గౌరవ సూచకంగా విగ్రహానికి అధికారికంగా కంటోన్మెంట్ సీఈఓ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించేవారు.

కార్గిల్ దివస్ 25 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా కంటోన్మెంట్ అధికారులు ఆయనకు గౌరవ సూచకంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించకపోవడం పట్ల సర్వత్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఒక పేద కుటుంబం నుంచి మిలిటరీలో చేరి లాన్స్‌నాయక్ స్థాయికి ఎదిగిన రాంచందర్ పట్ల అధికారులు చూపిన వివక్ష పలువురిని ఆలోచింపజేస్తుంది.

మార్కెట్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన డీసీపీ

రెజిమెంటల్‌బజార్, జులై 26 (ఆంధ్రజ్యోతి): మార్కెట్ పోలీస్ స్టేషన్‌ను నార్త్ జోన్ డీసీపీ రశ్మీ పెరుమాళ్ సందర్శించారు. శుక్రవారం మార్కెట్ పోలీస్ స్టేషన్‌లో ఫైళ్లను క్షుణ్ణంగా పరిశీలించి కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్‌లోని రిసెప్షన్, లాకప్ గది, రికార్డు రూమ్, సీసీ కెమెరాల మానిటరింగ్, సిబ్బంది విశ్రాంతి గదులతోపాటు స్టేషన్ లోపల, బయట పరిసర ప్రాంతాలను పరిశీలించారు. స్టేషన్‌కు వచ్చే వారితో మర్యాదపూర్వకంగా మసలుకోవాలని, వారి సమస్యలు సానుకూలంగా విని పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని సూచించారు. వాననీరు భూమి లోపలికి వెళ్లేలా నిర్మించిన ఇంకుడు గుంత నిర్వాహణ చూసుకోవాలన్నారు. ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్, ఎస్సైలు మమత, శ్రీవర్ధన్, గిరిధర్ పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు సన్మానం చేస్తున్న రెవెన్యూ ఉద్యోగులు

మారేడుపల్లి తహసీల్దార్‌గా భీమయ్య గౌడ్

అడ్డగుట్ట, జులై 26 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ డివిజన్ మారేడుపల్లి రెవెన్యూ తహసీల్దార్‌గా భీమయ్య గౌడ్ శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. గతంలో అమీర్‌పేట్ మండలం తహసీల్దార్‌గా పనిచేశారు. ఈ సందర్భంగా మారేడుపల్లి రెవెన్యూ అధికారులు, ఉద్యోగులు తహసీల్దార్‌ను ఘనంగా సన్మానం చేశారు.



సురేష్‌ను అభినందిస్తున్న సత్యప్రసాద్

క్రికెట్ అభివృద్ధిలో జర్నలిస్టుల కృషి ఎనలేనిది

- ఏసీఏ మాజీ సీఏసీ చైర్మన్ సత్యప్రసాద్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): దేశంలో క్రికెట్‌కు ఈస్థాయిలో ఆదరణ లభించడానికి, క్రికెట్ ఇంతలా అభివృద్ధి కావడానికి జర్నలిస్టులు చేసిన కృషి ఎనలేనిదని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ మాజీ సీఏసీ చైర్మన్ సత్యప్రసాద్ అభిప్రాయపడ్డారు. శుక్రవారం విజయానంద్ మైదానంలో జరిగిన కేఎస్‌సీ జర్నలిస్టు ప్రీమియర్ లీగ్ సెమీఫైనల్స్ ప్రారంభానికి సత్యప్రసాద్, లైఫ్‌స్పాన్ స్పోర్ట్స్ హెడ్ భరణి ముఖ్య అతిథిలుగా విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక నైపుణ్యం గల ప్లేయర్‌ను పైకి తీసుకురావడంలో జర్నలిస్టులు పడే తాపత్రయం, శ్రద్ధను ప్రశంసించారు. అనంతరం టాస్ వేసి, ఇరు జట్ల ప్లేయర్లకు శుభాకాంక్షలు తెలిపారు. ఇక, తొలి సెమీఫైనల్లో ఎన్టీవీ రైజర్స్ జట్టుపై ఏబీఎన్-ఆంధ్రజ్యోతి టీమ్ 48 పరుగుల తేడాతో పోరాడి ఓడింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఎన్టీవీ 20 ఓవర్లలో 155/7 స్కోరు చేసింది. ఛేదనలో ఆంధ్రజ్యోతి 20 ఓవర్లలో 107/9 మాత్రమే స్కోరు చేసి ఓటమి పాలైంది.

'మిస్టరీ ఆఫ్ ది మిస్సింగ్ జ్యువెల్స్' పుస్తకానికి ప్రశంసలు

- పుస్తక రచయిత ఐదవ తరగతి విద్యార్థి దైవిక్



హైదరాబాద్ సిటీ, జులై 26 (ఆంధ్రజ్యోతి): పిల్లలకు, యువకులకు సెల్‌ఫోన్ ప్రపంచంగా మారిన ఈ రోజుల్లో 10ఏళ్ల బాలుడు రాసిన కథల పుస్తకం పాఠకుల ఆదరణను సాధించింది. తెల్లాపూర్ మంథన్ స్కూల్‌లో 5వ తరగతి చదువుతున్న దైవిక్ పుస్తకాన్ని రచించాడు. అనగనగా ఒక రాజ్యం. ఆ రాజ్యం ఆభరణాలు తయారు చేయడంలో ప్రసిద్ధి చెందినది. ఒక దొంగ ఆభరణాలను దొంగిలిస్తాడు. ఆ ఆభరణాల మిస్టరీని యువరాజు ఎలా చేధించాడన్నదే "మిస్టరీ ఆఫ్ ది మిస్సింగ్ జ్యువెల్స్" కథ. ఈ పుస్తకం విడుదల అయినప్పటి నుంచి అనేక మంది పుస్తకప్రియులు ప్రశంసలు కురిపిస్తున్నారు. యువ రచయిత ఇటీవల బ్రిబుక్స్ నుంచి ప్లాటినం రచయిత సర్టిఫికెట్ అందుకున్నారు. ఈ పుస్తకం చాలా తక్కువ సమయంలో పాఠకుల ఆదరణ పొందింది. ఈ సందర్భంగా దైవిక్ మాట్లాడుతూ నాకు పుస్తకాలు చదవడం అంటే చాలా ఇష్టం.

కల్పిత కథలపై ప్రత్యేక ఆసక్తి. మా అమ్మ నాలోని జిజ్ఞాసను గమనించి పుస్తకం రాయమని ప్రోత్సహించింది. గతంలో చదివిన కథల ప్రేరణతోనే ఈ కథను రాశాను. దైవిక్ తల్లి సౌజన్య మాట్లాడుతూ దైవిక్‌కు పౌరాణిక కథలంటే ఆసక్తి అని, ట్రేసీ వెస్ట్ థియా స్టిల్టన్ రచనలను అమితంగా ఇష్టపడతారని తెలిపారు. దైవిక్ ప్రయత్నాలకు మద్దతు ఇస్తున్న మంథన్ పాఠశాలకు కృతజ్ఞతలు తెలిపారు. దైవిక్ చదువుతోపాటు, క్రీడలలో ప్రతిభ చూపుతూ అనేక బహుమతులు గెలుచుకున్నాడని తెలిపారు.